సాక్షి
బాపట్ల
శనివారం । 9 । డిసెంబర్ । 2023



అమరేశ్వరుని సేవలో మంత్రి రోజా

అమరావతి: అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామిని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా శుక్రవారం దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 522.30 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



భక్తజన సందడి

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో శుక్రవారం తెల్లవారు జాము నుంచి భక్తుల రద్దీ కనిపించింది. పంచహారతులు, దీపార్చనలోనూ పాల్గొన్నారు.



'జన'జయధ్వానాలు : పాతనందాయపాలెం వద్ద సీఎం జగన్‌కు జేజేలు పలుకుతున్న ప్రజలు

సేద్యానికి స్థైర్యం

- నేనున్నానంటూ.. భరోసా
- ఆదరించి.. అక్కున చేర్చుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- బాపట్ల జిల్లా పాతనందాయపాలెంలో మిర్చి పంట పరిశీలన
- బుద్దాంలో వరి పంట పరిశీలన
- రైతులతో ముఖాముఖి
- సంక్రాంతిలోపే ఇన్‌పుట్ సబ్సిడీ
- బాధిత రైతులందరికీ బీమా
- అభయమిచ్చిన వరాల రేడు

గుండె తడి ఆరక మౌనంగా రోదిస్తున్న పుడమితల్లి వరాల రేడు ఆత్మీయంగా స్పృశించినట్టు పులకించింది. నేలవాలిన వరి కంకులు ఆదుకునే ఆపన్నహస్తమేదో వెన్ను నిమిరినట్టు పరవశించాయి. నీటకరిచిన మిరప మొక్కలు చల్లనిచూపేదో తాకినట్టు ఊరడిల్లాయి. కంటికి రెప్పలా సాకిన పంట కళ్లెదుటే పడిపోతే నిలువునా కుప్పకూలిన అన్నదాత 'నేనున్నానన్న' చిరు పలకరింపునకు కదిలిపోయాడు. కారుచీకటిలో ఆశల దివ్వెలేవో వెలిగినట్టు మోము నిండుగా నవ్వులు చిందించాడు. ఇక వరాల పంట పండినట్టేనని మురిసిపోయాడు. దీనజనా'కర్షక'.. జయహో జగన్ అంటూ నినదించాడు. బాపట్ల జిల్లా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఆద్యంతం దిగ్విజయంగా సాగింది. కర్షకులకు కొండంత భరోసానిచ్చింది.



నవ్వుల వసంతం : కర్లపాలెం మండలం పాతనందాయపాలెంలో రైతుతో కలిసి నవ్వులు చిందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి,బాపట్ల: "మీ బిడ్డ ప్రభుత్వంలో ఏ ఒక్కరికీ నష్టం, ఇబ్బంది జరగదు. తుఫాన్ వల్ల జరిగిన నష్టం అపారం. జరగాల్సిన సహాయం, పారదర్శకంగా జరుగుతుంది. వేగంగా జరుగుతుంది. గత ప్రభుత్వాల కంటే మిన్నగా జరుగుతుంది. మీ చేయిపట్టి తీసుకెళ్లి న్యాయంచేసే సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ మనది. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు." అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలోని తుఫాన్ బాధిత రైతులకు భరోసా ఇచ్చారు. శుక్రవారం సీఎం బాపట్ల జిల్లాలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈదురుగాలులు, భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సీఎం ప్రసంగానికి హర్షధ్వానాలతో మద్దతు

ముఖ్యమంత్రి తిరుపతి జిల్లా పర్యటన ముగించుకొని శుక్రవారం మధ్యాహ్నం 2.24 గంటలకు బాపట్లకు వచ్చారు. మరుప్రోలువారిపాలెం వద్ద 216 జాతీయ రహదారిపై హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసిన తుఫాన్ ప్రభావ ఫొటో గ్యాలరీని సందర్శించారు. బాధిత ప్రజలతో మాట్లాడారు. ఆ తరువాత 2.52 గంటలకు హెలిప్యాడ్ ప్రాంతం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 3.06 గంటలకు కర్లపాలెం మండలం పాతనందాయపాలెం వద్ద నీట మునిగిన మిర్చి పంటను పరిశీలించారు. అక్కడే రైతులను కలిసి మాట్లాడారు. 3.23 గంటలకు రైతులనుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. రైతులకు తమ ప్రభుత్వం ఎలా అండగా ఉంటూ వస్తోందో వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ప్రతి ఏటా రైతులకు బీమా, నష్టపోయిన వారికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు ప్రభుత్వం రైతులకు రూ.7,800 కోట్లు ఇచ్చినట్లు సీఎం వెల్లడించారు. ముఖ్యమంత్రి ప్రసంగానికి అడుగడుగునా రైతులు హర్షధ్వానాలతో మద్దతు పలికారు. ఈ ఏడాది సంక్రాంతి నాటికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని సీఎం ప్రకటించగానే అన్నదాతలు జయజయధ్వానాలు చేశారు. ఈలలు కేకలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు.



జై కిసాన్.. జై జగన్: పాతనందాయపాలెంలో జరిగిన సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంలో మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, కలెక్టర్ రంజిత్‌బాషా

కాలువల సమస్యకు పరిష్కారం

చంద్రబాబు ప్రభుత్వం రైతుల గోడు పట్టించుకోలేదని సీఎం వైఎస్ జగన్ చెప్పగానే రైతులు నిజమేనంటూ గళం కలిపారు. తరువాత 3.48 గంటలకు బుద్దాం గ్రామం వద్ద నీటమునిగిన వరి పంటను పరిశీలించిన ముఖ్యమంత్రి అక్కడి రైతులతో మాట్లాడారు. ప్రధాన కాలువలు కుంచించుకుపోయాయని, ఫలితంగా వరద నీరు పొలాలపైకి వస్తోందని రైతులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. సీఎం వెళ్లే మార్గంలో దారిపొడవునా ప్రజలు ఇరువైపులా నిలుచుని జేజేలు పలికారు. తరువాత 4.30 గంటలకు ముఖ్యమంత్రి తిరిగి రోడ్డు మార్గాన హెలిప్యాడ్ వద్దకు చేరుకొని 4.45 గంటలకు హెలికాప్టర్‌లో తాడేపల్లికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, హోంమంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జీడీసీసీ చైర్మన్ లాలుపురం రాము, మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, గాదె మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఉన్నారు.



కల'వరి'ంచే గుండెకు భరోసా : బుద్దాం వద్ద వరి పంటను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంలో ఎమ్మెల్యే కోన రఘుపతి

సీఎం ముందు చూపు వల్లే నష్ట నియంత్రణ

బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిచాంగ్ తుఫాన్ బాధితులకు ఆది నుంచి అండగా నిలిచారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి కొనియాడారు. పాత నందాయపాలెం వద్ద రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో తొలుత కోన ప్రసంగించారు. తుఫాన్‌కు రెండు రోజుల ముందు నుంచే ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేసి తీవ్రనష్టం జరగకుండా చూశారన్నారు. సీఎం ఆదేశాలతో అధికారులు సకాలంలో స్పందించి అల్పపీడన హెచ్చరికలు జారీ చేసినప్పటి నుంచే పునరావాస కార్యక్రమాలను చేపట్టారన్నారు. అందువల్లే ప్రాణ, భారీ ఆస్తి నష్టాలు, పశు నష్టం జరగలేదన్నారు. 97 వేల హెక్టార్లలో వరి, ఇతర పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. సీఎం జగన్ ఉన్నారన్న ధైర్యం రైతుల్లో ఉందన్నారు. ఏనాడూ రైతులకు సాయమందించని చంద్రబాబు పనిగట్టుకొని రైతు ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. తన ఐదేళ్ల పాలనలో బాబు కరువులతో అల్లాడిన రైతులను పట్టించుకోలేదని కోన రఘుపతి ధ్వజమెత్తారు.



జనా'కర్షకం' : పాతనందాయపాలెం వద్ద రైతులతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

చంద్రబాబు అర్ధరాత్రి షోకాలు

- పంటల పరిశీలన పేరుతో అర్ధరాత్రి బాబు రోడ్ షో
- రాత్రి కావడంతో పంటలు పరిశీలించని వైనం
- వేమూరు, రేపల్లె మీదుగా బాపట్ల వరకు పర్యటన
- సీఎం వై.ఎస్.జగన్ ప్రభుత్వంపై పనిగట్టుకుని విమర్శలు
- అన్నదాతలను వంచించి ఓట్లు వేయించుకునేందుకు కొత్తవేషం
- తన హయాంలోనే మేలు జరిగిందంటూ అబద్ధాలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల : జిల్లాలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు వచ్చిన చంద్రబాబు తన హయాంలోనే రైతులకు మేలు జరిగిందన్నట్లు కొత్త పల్లవి అందుకోవడంపై రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో వేమూరు నియోజకవర్గం అమర్తలూరు వచ్చిన చంద్రబాబు పెదపూడి, కూచిపూడి ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావిత పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమం పూర్తయ్యేసరికి చీకటి పడింది. ఆ తరువాత ఆయన చెరుకుపల్లి, నగరం ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం బాపట్ల నియోజకవర్గంలోని అమర్తలూరు, కర్లపాలెం గుండా రాత్రి 11.30 గంటలకు బాపట్ల చేరుకున్నారు.

చంద్రబాబు పర్యటన తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పంటలను పరిశీలించి, రైతులను పరామర్శించినట్లు లేదు. పర్యటన మొత్తం రాత్రి పూట చీకట్లో రోడ్‌షోలా సాగింది. పర్యటన ఆసాంతం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం, వై.ఎస్.జగన్‌పై పనిగట్టుకుని విమర్శలు చేయడానికే ప్రాధాన్యం ఇచ్చారు. తన హయాంలోనే రైతులకు మేలు జరిగిందని, తుఫాన్‌లను సమర్థంగా ఎదుర్కొన్నానని, పంటల బీమాతో పాటు, అన్నిరకాల సహాయాలను అందించానని అబద్ధాలు వల్లెవేశారు. రైతు వ్యతిరేకిగా ముద్రపడిన బాబు ఇప్పుడు రైతులపై ప్రేమ వలకబోస్తూ మాట్లాడిన మాటలు విని రైతులు, ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. తన హయాంలో రైతులకు పరిహారం ఎక్కువ ఇచ్చానని, జగన్ వచ్చాక దాన్ని తగ్గించారని బాబు విమర్శలు చేయడం చూసి రైతులు మండి పడుతున్నారు. తిరిగి తనకు అధికారం అప్పగిస్తే రైతులకు ఇచ్చే ఇన్సూరెన్సు, ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు, అన్నిరకాల పథకాలకు సంబంధించిన పరిహారాలను రెండు నుంచి మూడింతలు పెంచుతానంటూ బాబు పదే పదే చెప్పారు. ఓట్ల కోసమే చంద్రబాబు రైతులను వంచించే ప్రయత్నం చేశారు. ఇది విన్న రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏనాడూ రైతుల గోడు పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు ఓట్ల కోసం రైతులపై ప్రేమను వలకబోస్తున్నారని విమర్శిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఓట్ల కోసమే బాబు కపట ప్రేమ చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి పరిహారం విషయంలో సూచన చేయాల్సిన చంద్రబాబు అది చేయకుండా రాబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తే పెద్ద మొత్తంలో పరిహారం ఇస్తానంటూ ఓట్ల రాజకీయానికి తెరలేపడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మానవత్వం చాటుకున్న పోలీసులు

- ట్రాఫిక్‌లో చిక్కుకున్న గర్భిణి
- పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలించిన ఎస్‌ఐ
- పండంటి బిడ్డకు జన్మనిచ్చిన మహిళ
- పోలీసులకు ప్రశంసలు

కర్లపాలెం/వేటపాలెం: నిండు గర్భిణిని స్వయంగా తన వాహనంలోనే హాస్పిటల్‌కు పంపి వేటపాలెం ఎస్సై జి.సురేష్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆసుపత్రిలో గర్భిణి పండంటి శిశువుకు జన్మనిచ్చింది. దీంతో ఎస్సై సురేష్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. శుక్రవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తుఫాన్ ముంపునకు గురైన పొలాలను పరిశీలించడానికి బుద్దాం గ్రామానికి వెళుతుండడంతో గ్రామం వద్ద పోలీస్ అధికారులు మధ్యాహ్నం 2:30 గంటలకు హైవేపై ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. అదే సమయంలో బాపట్ల జిల్లా నిజాంపట్నంకు చెందిన కొక్కిలిగడ్డ ఏసుబాబు పురిటి నొప్పులు పడుతున్న తన భార్య అంజలిని కర్లపాలెం ఆసుపత్రికి ఆటోలో తీసుకు వెళుతూ బుద్దాం గ్రామం ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్‌కి చేరుకున్నారు. ఆమె పురిటి నొప్పులతో బాధపడుతుండడాన్ని అక్కడ విధులు నిర్వహిస్తున్న వేటపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ జి.సురేష్ గమనించి వెంటనే జిల్లా ఎస్పీకి సమాచారం అందించడంతో వెంటనే ఆమెను హాస్పిటల్‌కు తీసుకువెళ్లాలని ఎస్పీ సూచించారు. ఎస్‌ఐ తన వాహనంలో వారిని ఎక్కించి పోలీస్ సిబ్బంది ద్వారా వారిని సకాలంలో కర్లపాలెంలోని హాస్పటల్‌లో చేర్పించారు. కట్టుదిట్టమైన బందోబస్తు విధులలో ఉన్నప్పటికీ ప్రజలు ఆపదలో ఉన్నారంటే వారిని రక్షించడానికి పోలీసులు వేగంగా స్పందిస్తారని ఈ ఘటనతో రుజువైంది. విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరించే పోలీసు అధికారులు సకాలంలో స్పందించి నిండు గర్భిణి అయిన తన భార్యను హాస్పటల్‌కు తరలించి మానవత్వం చాటుకోవడం ఆనందాన్ని నింపిందని, పోలీస్ అధికారులకు, జిల్లా ఎస్పీ వకూల్ జిందాల్‌కు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.



న్యూస్‌రీల్

కలెక్టర్ ఔదార్యం

పేద మహిళకు రూ.లక్ష ఆర్థిక సాయం



కలెక్టరేట్‌లో మహిళకు ఆర్థిక సహాయం అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ఏమాత్రం సంపాదించే అవకాశంలేని ఓ పేద మహిళకు కలెక్టర్ ఎల్.శివశంకర్ రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. చిలకలూరిపేటకు చెందిన నంబూరు నాగ సత్యవాణి కలెక్టర్ శివశంకర్ లోతేటిని కలిసి తన గోడు వెళ్లబోసుకుంది. తన భర్త శివప్రసాద్, చిన్న కుమార్తె అనారోగ్యంతో మృతిచెందారని, వితంతువైన పెద్ద కుమార్తె తన వద్దనే ఉంటుందని, ఆమెకు ఆరోగ్యం సరిగా లేదని, ఏమాత్రం సంపాదనకు అవకాశం లేనందున ఆర్థిక సాయం అందించాలని విన్నవించుకుంది. తక్షణం స్పందించిన కలెక్టర్ మానవతా దృక్పథంతో రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని మీడియా పాయింట్ వద్ద అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

నలుగురికి డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రాష్ట్ర వ్యాప్తంగా 15 మంది ఎస్‌హెచ్‌ఓ (సీఐ)లకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో గుంటూరు రేంజ్ పరిధిలోని నలుగురు సీఐలు ఎం.హనుమంతరావు, టి.వి.రత్న స్వామి, షేక్.అబ్దుల్‌కరీం, కె.వెంకటేశ్వరరావు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి పొందారు. వీరికి వెంటనే ప్రభుత్వం డీఎస్పీలుగా పోస్టింగ్‌లూ ఇచ్చింది. ప్రకాశం జిల్లా ఒంగోలు పీటీసీలో ఉన్న ఎం.హనుమంతరావును సీఐడీ డీఎస్పీగా, గుంటూరు జిల్లాలో వెయిటింగ్‌లో ఉన్న రత్నస్వామిని గుంటూరు జిల్లా స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ) డీఎస్పీగా, ప్రస్తుతం సీఐడీలో ఉన్న షేక్. అబ్దుల్ కరీంను పీసీఎస్/ఎస్‌డీఎస్పీగా, వేమూరు సర్కిల్ (జీటీఆర్)లో ఉన్న కె.వెంకటేశ్వరరావును విజిలెన్స్/ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా ఉన్నతాధికారులు నియమించారు. గుంటూరు జిల్లా ఎస్‌బీ డీఎస్పీని ఇటీవల అవినీతి ఆరోపణల నేపథ్యంలో వీఆర్‌కు పంపించినప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ప్రస్తుతం టి.వి.రత్నస్వామితో ఆ పోస్టును భర్తీచేశారు.

13న ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో డిప్లొమా ఇన్ ఫార్మసీ కోర్సులో భర్తీ కాగా మిగిలిన సీట్లను పూరించేందుకు ఈనెల 13న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ప్రభాకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బైపీసీ, ఎంపీసీ రెగ్యులర్‌గా పూర్తి చేసిన విద్యార్థినులతోపాటు దూర విద్య విధానం ద్వారా పూర్తి చేసిన విద్యార్థినులూ అర్హులేనని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, రూ.6,300 ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో వసతి సదుపాయం కలదని, స్పాట్ అడ్మిషన్ ద్వారా సీటు పొందే విద్యార్థినులకు ఎటువంటి ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్ వర్తించబోవని స్పష్టం చేశారు.

పురాతన శివాలయం పునర్నిర్మాణానికి శ్రీకారం



యద్దనపూడి: సుమారు రెండు శతాబ్దాల నాటి పురాతన శివాలయ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. వంకాయలపాడులోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. ఆరు నెలల కిందట ధర్మకర్తలు ఆలయం పునర్నిర్మించాలని నిర్ణయించుకున్నారు. గ్రామస్తుల సహకారంతో మూడు నెలల కిందట ఆలయాన్ని పూర్తిగా తొలగించారు. కార్తికమాసం శుక్రవారం ఉదయం 9.40 గంటలకు నూతన ఆలయానికి ముహూర్తం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో గుంటూరుకు చెందిన నాగేశ్వరం రాఘవేంద్రశర్మ పర్యవేక్షణలో రుత్వికుల వేద మంత్రోచ్ఛరణల మధ్య హోమపూజలు చేశారు. ఆయా పూజల్లో దంపతులు పాల్గొన్నారు. గ్రామస్తుల సంపూర్ణ సహకారంతో సుమారు రూ.కోటి వ్యయంతో దీనిని నిర్మిస్తున్నట్లు ధర్మకర్తలు తెలిపారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి శిక్షణకు వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు



బాపట్ల అర్బన్: వ్యవస్థాపక అభివృద్ధి ప్రణాళికలో భాగంగా జాతీయ ఉన్నత విద్య పథకం ద్వారా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికయ్యారని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు చెప్పారు. హైద్రాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్ మెంట్ సంస్థ వీరికి శిక్షణ ఇస్తారని వెల్లడించారు. ప్రతిష్టాత్మకమైన సంస్థ ద్వారా కొత్త తరానికి వ్యవస్థాపక నిర్మాణంలో నైపుణ్యాలు అందించబడతాయన్నారు. శిక్షణకు నలుగురు విద్యార్థినులు మెరిట్ ద్వారా ఎంపిక చేయబడ్డారని, వీరికి ఈనెల తొమ్మిది నుంచి 29వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐడీపీ అసిస్టెంట్ కో ఆర్డినేటర్లు డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ బి.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించాలి

ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎర్రయ్య



రేపల్లె: విద్యార్థులకు నాణ్యమైన విలువలతో కూడిన విద్యను అందించి ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి అధ్యాపకులు శక్తివంచన లేకుండా పనిచేయాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి పి.ఎర్రయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించి అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఈ విద్యా సంవత్సరం నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక చొరవ తీసుకుని అవసరమైన ప్రత్యేక తరగతులు నిర్వహించి వీరి అభ్యున్నతికి కృషి చేయాలని చెప్పారు. కళాశాలలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని రికార్డుల రూపంలో పొందుపరచాలని చెప్పారు. రిజిస్ట్రర్‌లను, ఇతర రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులను వివిధ ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. కళాశాలలోని వివిధ ల్యాబ్‌లను, ల్యాబ్‌లలోని వివిధ పరికరాలను తనిఖీ చేశారు. గత సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన అనిల్ అభ్యున్నతికి కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. అనంతరం కళాశాల సిబ్బంది విద్యాశాఖ అధికారి ఎర్రయ్యను సత్కరించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు పి.సుధాకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక కృషి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి

కొడవలివారిపాలెం (కారంచేడు): తుఫాన్ ధాటికి కొట్టుకుపోయిన చప్టా స్థానంలో వంతెన నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, సహకార, మార్కెటింగ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కొడవలివారిపాలెం-తిమిడెదపాడు రోడ్డులో కొట్టుకుపోయిన చప్టా(ఉత్తర పొలం వాగు)ను పరిశీలించారు. ఇరు గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, రైతులు కొంత మంది ఆయనను కలిసి కొన్నేళ్లుగా ఈ వాగు వరద ఉధృతికి కొట్టుకుపోతుందన్నారు. వరదలు వచ్చిన ప్రతిసారీ రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. అన్నదాతలు నిత్యం పొలం పనుల కోసం ఈ ప్రధాన రహదారిలోనే ప్రయాణిస్తుంటారన్నారు. తిమిడెదపాడు, పూసపాడు అడ్డరోడ్డు, ఆదిపూడి, కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, దగ్గుబాడు, ఇంకొల్లు, స్వర్ణ గ్రామాల ప్రజలు ఈ రహదారిలో ప్రయాణాలు సాగిస్తుంటారన్నారు. వాగుపై ఉన్న ఈ కల్వర్టు కొట్టుకుపోవడం వలన ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరదల సమయంలో ఆర్అండ్‌బీ అధికారులు కంటి తుడుపుగా తాత్కాలిక మరమ్మతులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారన్నారు. ఇలా కాకుండా శాశ్వత పరిష్కారం కోసం వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరారు. బత్తుల వెంటనే స్పందించి ఆర్అండ్‌బీ అధికారులతో తాను స్వయంగా మాట్లాడి వంతెన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయించి పనులు కూడా త్వరగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, బాపట్ల జిల్లా సహకార శాఖాధికారి కేవీ రామారావు, ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ కొడాలి మోహన్‌కృష్ణ, గోగినేని బుల్లెబ్బాయి, సొసైటీ అధ్యక్షులు కొడాలి ధర్మానందరావు, జయప్రకాష్, నాయకులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



అలుగు వాగును పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు బ్రహ్మానందరెడ్డి

కూలి డబ్బులు ఇవ్వటంలేదని ఆత్మహత్యాయత్నం

కేసు నమోదు చేసిన పోలీసులు

మేదరమెట్ల: బేల్దారు పనిచేయించుకొని తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వడం లేదని మనస్థాపం చెందిన బేల్దారు కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం కొరిశపాడు మండలం మేదరమెట్ల చరణ్ నర్సింగ్ హోమ్ వద్ద చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..

మేదరమెట్ల గ్రామంలోని చరణ్ నర్సింగ్ హోమ్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు చెందిన బిల్డింగ్‌ను తమ్మవరం రోడ్డులో నూతనంగా నిర్మించేందుకుగాను తమ్మవరం గ్రామానికి చెందిన బేల్దారు వల్లెపు వెంకటేశ్వర్లు కాంట్రాక్టు కుదుర్చుకున్నాడు. బిల్డింగ్ పూర్తయినా గడచిన ఆరేళ్లుగా తనకు రావల్సిన రూ.33 లక్షలు ఎన్నిసార్లు అడిగినా ఇవ్వడంలేదని, దీనిపై లేబర్‌కోర్టుకు కూడా వెళ్లానని వెంకటేశ్వర్లు చెప్పాడు. తనకు ఎవరూ న్యాయం చేయడం లేదని మనస్థాపం చెందిన అతను నర్సింగ్ హోం ఎదురుగా కొద్దిసేపు నిరసన తెలిపాడు. అనంతరం కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకునేందుకు ప్రయత్నించాడు. స్థానికులు, పోలీసులు అక్కడకు చేరుకొని ఆత్మహత్యకు పాల్పడిన వెంకటేశ్వర్లును అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు మేదరమెట్ల పోలీసులు తెలిపారు. దీనిపై పోలీసులు తెలిపిన సమాచారం మేరకు డాక్టర్ వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు బిల్డింగ్ నిర్మించేందుకు అగ్రిమెంట్ చేసుకున్న బేల్దార్ సుబ్బారావు (ఇతను వెంకటేశ్వర్లు తండ్రి) వెంకటేశ్వర్లు మరో నలుగురు కలసి వచ్చి తమ వైద్యశాలపై దౌర్జన్యం చేశారని బిల్డింగ్ పూర్తి చేయకుండానే వెళ్లిపోవడంతో పెద్దల సమక్షంలో మాట్లాడుకున్నామని చెప్పాడు. గతంలోనే అగ్రిమెంటును తీసివేశామని అతనికి డబ్బులు ఏమీ ఇవ్వనవసరం లేదని మేదరమెట్ల స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వెంకటేశ్వర్లు పక్కన కుటుంబ సభ్యులు

టీడీపీ నేతల తన్నులాట

- నియోజకవర్గ ఇన్‌చార్జి రామాంజనేయులు సమక్షంలో రచ్చరచ్చ
- బాబు పర్యటన ఏర్పాట్ల సమావేశంలో రెచ్చిపోయిన ఇరువర్గాలు
- మరోసారి బయటపడ్డ టీడీపీ ఆధిపత్య పోరు

ప్రత్తిపాడు: చంద్రబాబు రాక టీడీపీ నేతల చావు కొచ్చింది. అసలే నైరాశ్యంలో ఉన్న ఆ పార్టీ నేతలు సహనం కోల్పోయారు. ఆధిపత్య పోరులో పైచేయి సాధించేందుకు ఇరువర్గాలు పార్టీ కార్యాలయంలో బహిరంగంగా తన్నుకున్నాయి. నిలువరించాల్సిన నియోజకవర్గ ఇన్‌చార్జి చేసేదేమీ లేక నిస్సహాయంగా కళ్లప్పగించి చూస్తూ ఉండిపోవాల్సి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడు మండలంలో కొద్ది నెలలుగా టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ ఒక వర్గంగా, టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, రావి శివరామకృష్ణ మరొక వర్గంగా మారి పార్టీ కార్యక్రమాల్ని వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు వర్గపోరు చాప కింద నీరులా ఉన్నప్పటికీ.. బి.రామాంజనేయులును నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన నాటి నుంచి తీవ్రమైంది. ఆయన ఒక వర్గానికే అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుండటంతో.. ఇరువర్గాలు బలాబలాల్ని నిరూపించుకునేందుకు పార్టీ కార్యక్రమాల్ని వేర్వేరుగా నిర్వహిస్తూ బహిరంగంగానే బాహాబాహీకి దిగుతున్నాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లతో నేతలు విరుచుకుపడుతున్నారు.

బాబు రాక .. తెలుగు తమ్ముళ్ల కాక

ఈ నేపథ్యంలో తుపానుతో నష్టపోయిన పంట పొలాల్ని పరిశీలించేందుకు తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు శనివారం పెదనందిపాడు మండలంలో పర్యటించనున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి రామాంజనేయులు శుక్రవారం నందిపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఇరువర్గాలు హాజరయ్యాయి. వీరిలో బాలకృష్ణ వర్గానికి చంద్రబాబు రోప్ బాధ్యతను, హనుమంతరావు వర్గానికి భోజనాల బాధ్యతను రామాంజనేయులు అప్పగించారు. ఒక వర్గం తమకు రోప్ బాధ్యతలు కావాలని పట్టుబట్టడంతో వివాదం మొదలయ్యింది. ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వివాదం చినికిచినికి గాలివానలా మారి, పార్టీ కార్యాలయంలోనే ఇరు వర్గాలు తన్నుకున్నాయి. అక్కడే ఉన్న రామాంజనేయులు కనీసం నిలువరించే ప్రయత్నం చేయకుండా చూస్తూ మిన్నకుండిపోవడం విమర్శలకు తావిచ్చింది.



పెదనందిపాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నేతల బాహాబాహి

సీఎం జగన్ పర్యటనకు పటిష్ట భద్రత

బాపట్ల అర్బన్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాపట్ల జిల్లా పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ భద్రత ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. బందోబస్తు నిర్వహించే సమయంలో విధుల పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని ఎస్పీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మిచాంగ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు రోడ్డు మార్గాన బాపట్ల నుంచి కర్లపాలెం మండలం బుద్దాం గ్రామం వరకు వెళ్లనున్న నేపథ్యంలో పూర్తిస్థాయి భద్రత ఏర్పాట్లను ఎస్పీ కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించి పరిశీలించింది. హెలిప్యాడ్ నుంచి బుద్దాం గ్రామం వరకు రోడ్డు మార్గంలో విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది ముఖ్యమంత్రి కాన్వాయ్ వచ్చే సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ ఎంతో అప్రమత్తంగా విధులు నిర్వహించారు. ట్రాఫిక్ బందోబస్తులో ఉండే అధికారులు ట్రాఫిక్ నియంత్రణ, మళ్లింపు సవ్యంగా జరిగేలా చర్యలు చేపట్టారు. రోప్, స్ట్రైకింగ్ పార్టీలు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండేలా చూశారు.

ఫార్మా రంగంలో భారత్‌ది ప్రత్యేక స్థానం

- ఏఎన్‌యూ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ అనిత
- చలపతిలో జాతీయ సదస్సు ప్రారంభం

గుంటూరురూరల్: ఫార్మా రంగంలో ప్రపంచంలోనే భారతదేశం ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జి అనిత అన్నారు. నగర శివారు లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సును శుక్రవారం ఆమె ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన బయోఫోర్ ఇండియా ఫార్మాసూటికల్స్, సిండి ఫార్మా, విజె ఇన్‌స్ట్రుమెంట్స్ ఐవీవై, ఓవర్‌సిస్, లియో ఓవర్సీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నైతిక విలువలకు పట్టం కడుతూ నాణ్యమైన మందులు ఉత్పత్తికి, సరఫరాతోపాటు పేషెంట్ కౌన్సెలింగ్ వరకూ వివిధ రంగాల్లో మన దేశం దూసుకుపోతుందన్నారు. హైదరాబాద్ బయోలాజికల్ లిమిటెడ్ సంస్థ జనరల్ మేనేజర్ ధర్మేష్‌పటేల్ మాట్లాడుతూ నావెల్ డ్రగ్ డెలివరీ సిస్టమ్ ద్వారా నూతన పరమాణువులు, ఆవిష్కరణ ప్రక్రియనుంచి నూతన ఔషధాలను తయారు చేయటం ద్వారా ఎన్నో వ్యాధులకు సత్వర చికిత్స అందించవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి 250 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరీ కరస్పాండెంట్ వై సుజిత్‌కుమార్‌లు అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

సీఎం జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన రైతులు

కర్లపాలెం: తుఫాన్ ప్రభావం వలన నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు శుక్రవారం కర్లపాలెం వచ్చిన సీఎం జగన్‌ను చూసేందుకు రైతులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సీఎం వస్తారని తెలుసుకున్న ప్రజలు 12గంటలకే 216 జాతీయ రహదారి పక్కన ఉన్న కొత్త నందాయపాలెం పరిధిలో ఉన్న మిర్చి తోటల వద్దకు చేరుకున్నారు. దీనికి సమీపంలోనే సీఎం జగన్‌తో రైతులు మాట్లాడేందుకు వీలుగా అధికారులు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. సీఎం జగన్ మధ్యాహ్నం 3గంటలకు వచ్చి కొత్త నందాయపాలెం పరిధిలో నీట మునిగిన మిర్చి తోటలను పరిశీలించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో కరచాలనం చేసేందుకు ముఖ్యంగా మహిళలు, రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు పోటీ పడ్డారు. సీఎంను చూసేందుకు కర్లపాలెం సెంటర్‌లో ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. బుద్దాం వద్ద వరి పంటను పరిశీలించేందుకు వెళ్లిన సీఎంను చూసేందుకు జనం అధిక సంఖ్యలో వచ్చారు. స్థానిక వైద్యాధికారులు కొత్త నందాయపాలెం, బుద్దాంలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

కొండవీటి వాగును వీడని వరద ఉధృతి

ఇంకా నీటిలోనే మునిగి ఉరకెత్తుతున్న పంటలు



పొలాల్లో నుంచి పారుతున్న వరద నీరు

తాడికొండ: మిచాంగ్ తుఫాను ధాటికి కొండవీటి వాగు ఉప్పొంగింది. తాడికొండ మండలంలో వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ఇప్పటి వరకూ వరద ఉధృతి వీడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీగా పైనుంచి వస్తున్న వరదకు తోడు కొండవీటి వాగు గట్లు తెంచుకొని పంట పొలాలపై పడటంతో వేలాది ఎకరాలు నీటమునిగాయి. పెట్టుబడి ఒక్క రూపాయి వెనక్కి వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు నీటిలోనే కుళ్లి పోతుండటంపై ఆవేదన చెందుతున్నారు. గత పాలకుల వైఫల్యం కారణంగానే కొండవీటి వాగుకు ఆధునీకరణ లేక ఈ దుస్థితి దాపురించిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాగు వరదను ఎత్తిపోసేందుకు కృష్ణా బ్యారేజ్ వద్ద పంప్ హైస్‌ను నిర్మించినా, నీరు మళ్లింపునకు కాల్వల ఆధునీకరణ చర్యలు తీసుకోకపోవడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.